## క్లుప్తంగా

### ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు

**దుమ్ముగూడెం:** గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యంలో దుమ్ముగూడెం గ్రామంలోకి వరద నీరు రాకుండా ఉండేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు.గురువారం దుమ్ముగూడెం గ్రామం చివారులోని శ్మశాన వాటిక దగ్గర ఉన్న స్లూయిజ్ దగ్గర లీకేజీ ఉండటంతో దానిని ఇసుక బస్తాలతో మూసివేసి రక్షణ చర్యలు చేపట్టారు.ప్రస్తుతం గోదావరికి గంటకు అడుగు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యగా రక్షణ ఇసుక బస్తాలను పేర్చారు. పిటి మస్తాన్ వలీ కూలీలతో ఇసుక బస్తాలను స్లూయిజ్‌కు అడ్డంగా ఏర్పాటు చేశారు.

### జడ్జిని నియమించాలి

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం అధ్యక్షతన గురువారం బార్ అసోసియేషన్ కార్య నిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. మొబైల్ కోర్టుకు శాశ్వత ప్రాతిపదికన మెజిస్ట్రేట్ నియామకాన్ని సత్వరమే చేపట్టి, బడ్జెట్ మంజూరు చేయాలని, గత సంవత్సరంగా ఖాళీగా ఉన్న అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పోస్టును భర్తీ చేయాలని కోరారు. అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు సున్నం రమేష్, ప్రధాన కార్యదర్శి పూసల శ్రీనివాస చారి, సంయుక్త కార్యదర్శి, శ్రీమతి బాసం శారద రెడ్డి, కోశాధికారి నాగరాజు, గ్రంథాలయ కార్యదర్శి హనుమంత్ రావు, మహిళ న్యాయవాద ప్రతినిధి తరుణి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### కేన్సర్ శిబిరానికి స్పందన

**అశ్వారావుపేటరూరల్:** కాంగ్రెస్ పార్టీ, స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చొరవతో నిర్వహించిన ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారం అశ్వారావుపేటలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా.. ఈ శిబిరంలో రోగులకు ఆరోగ్య, కేన్సర్ పరీక్షలను నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో పలువురు వైద్యులు, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్ పాల్గొన్నారు.

### దాడి ఘటనలో కేసు నమోదు

**ములకలపల్లి:** దాడి ఘటనలో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని పొగళ్లపల్లికి చెందిన సోదరులు రాంబాబు, సురేష్ మధ్య ఇంటి స్థలం విషయమై గొడవ జరిగింది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో సురేష్ నిర్మాణం ప్రారంభించగా, రాంబాబు అడ్డుకున్నారు. సురేశ్, అతని కూతురు విజయలక్ష్మిపై దాడికి పాల్పడగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులను పాల్వంచ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**బాలిక అదృశ్యంపై..**

**ములకలపల్లి:** బాలిక అదృశ్యం ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం మేరకు.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక గురువారం దుకాణం వద్దకు వెళ్లి, తిరిగి ఇంటికి రాలేదు. సమీపస్తులను విచారించినా బాలిక జాడ తెలియలేదు. బాలిక కుటుంబీకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

**మణుగూరుటౌన్:** మండలంలోని రామానుజవరం వద్ద రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరొకరు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. రామానుజవరం ప్రధాన రహదారి వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా, పినపాక నుంచి మణుగూరుకు వస్తున్న మెరుగు రాకేశ్, మణుగూరుకు చెందిన వీరభద్రం(44)కు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 100 పడకల ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికి వీరభద్రం మృతి చెందాడు.

### ఎన్ఆర్ఐ వితరణ

**బూర్గంపాడు:** మండలంలోని అంజనాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ తేజావత్ జానకిరామ్ బూట్లు అందించారు. గతంలో పాఠశాలలో అనేక మౌలిక వసతుల కల్పనకు ఆయన సహకారమందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి యదుసింహరాజు మాట్లాడుతూ.. జానకిరామ్‌ను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు కిషన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉచితంగా ఇవ్వాలి

**ములకలపల్లి:** ఆదివాసీ రైతులకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌కె.ఉమర్, డివిజన్ కార్యదర్శి కుంజా కృష్ణ అన్నారు. మండల పరిధిలోని గుట్టగూడెం గ్రామంలో మడి చంద్రం అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సంఘ మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన.. మాట్లాడారు. ఆదినారాయణ, వంకా సురేశ్, వెంకటేశ్వర్లు, మధు, రమేశ్, భాస్కర్, నిర్మల, లక్ష్మి పాల్గొన్నారు.

# భూభారతిపైనే రైతుల ఆశలు

- ముగిసిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ
- నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభం
- సమస్యల పరిష్కారంపై రైతుల్లో ఆసక్తి



రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

**అశ్వారావుపేటరూరల్:** గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి పథకాన్ని రద్దు చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా 'భూ భారతి'చట్టం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి అన్ని మండలాల్లో గత నెల 3వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను గ్రామస్థాయిలో నిర్వహించి, రైతుల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తాజాగా రైతుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ పూర్తయింది.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..**

రెవిన్యూ సదస్సుల్లో సమస్యలపై రైతులు చేసుకున్న ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను రెవెన్యూ అధికారులు చేపట్టారు. గడిచిన కొద్ది రోజులుగా రెవెన్యూ యంత్రాంగం మండలాల వారిగా వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మండలాల వారిగా వచ్చిన దర ఖాస్తుల సంఖ్య తేలడంతోపాటు, ఇంకా స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో రైతుల వద్ద నుంచి వినతులు వస్తే స్వీకరిస్తున్నారు. కాగా, ఇప్పటి దాకా వచ్చిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి అయింది.

**నోటీసుల జారీ ప్రారంభం**

కాగా, ఇప్పటికే దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాగా, బుధవారం నుంచి నోటీసులు జారీ కార్యక్రమాన్ని మొదలైంది. దరఖాస్తులు చేసుకున్న రైతులకు ముందుగా వ్యక్తిగతంగా నోటీసులను జారీ చేసి, వాటిని ఆయా రైతులకు నేరుగా అందిస్తారు. నోటీసుల జారీ పూర్తయిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ తర్వాతి చర్యలు చేపడతాం.

**పరిష్కారంపై ఆశలు..**

కాగా, రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకోగా, ఆయా సమస్యల పరిష్కారంపై బాధిత రైతాంగం ఆశలు పెట్టుకుంది. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి చట్టంతో అనేక తప్పిదాలు చోటు చేసుకోగా, వాటిని పరిష్కరించేందుకు దరఖాస్తులు చేసిన ఫలితం రాలేదు. ఆయా తప్పిదాలను మార్పులు చేసేందుకు రెవిన్యూ అధికారులకు కుడా అవకాశం లేకపోవడంతో బాధిత రైతులు కార్యాలయాల చూట్టు తిరిగారు. కేవలం సీసీఎల్ స్థాయిలోనే సమస్యలు పరిష్కారానికి అవకాశం ఉండటంతో సన్న, చిన్నకారు రైతులు ఆ స్థాయికి వెళ్లలేక సమస్యలతోనే కాలం వెల్లదీశారు. ఆయా దరఖాస్తుల్లో అత్యధికంగా సాదాబైనామా సమస్యలపైనే రాగా, ఆ తర్వాత సర్వే నంబర్లలో తప్పులు, ఇతర సమస్యలపై అర్జీలు వచ్చాయి. ఆయా సమస్యలను త్వరలోనే క్షేత్రస్థాయిలో సిబ్బంది విచారణ చేపట్టి పరిష్కారానికి చర్యలు తీసుకొనున్నారు. దీంతో బాధిత రైతులు సమస్యల పరిష్కారంపై ఆశగా ఎదురుచూస్తున్నారు.

**ఆ సర్వే నంబర్లకు మోక్షం కలిగేనా?**

అశ్వారావుపేట మండలంలోని గిరిజన ప్రాంతాలైన కన్నాయిగూడెం, కొత్త కన్నాయిగూడెం, గోపన్నగూడెం, కంట్లం, పండువారిగూడెం, గాండ్లగూడెం, రామచంద్రాపురం పరిధిలోని సర్వే నంబరు 152లో గిరిజనులకు చెందిన 3,800 ఎకరాల సాగుభూములకు ఏళ్లుగా పట్టాదారు పాసుపుస్తకాల సమస్య నెలకొని ఉంది. ఈ సర్వే నంబరును ధరణిలో అన్‌సెటిల్డ్ భూములుగా నమోదు కాగా, పూర్వ పట్టాలు ఉన్న గిరిజన రైతులకు తీరని అన్యాయం జరిగింది. దీంతో ఏళ్లుగా తమ సమస్యను పరిష్కరించి, పట్టా పుస్తకాలు ఇవ్వాలని బాధిత గిరిజన రైతులు కార్యాలయాలు, ఉన్నతాధికారులకు వినతులు చేస్తున్నారు. అయినప్పటికీ గడిచిన ఆరేళ్లుగా ఈ సమస్యకు మోక్షం కలగలేదు. అలాగే అశ్వారాపేటలోని సర్వే నంబరు 911లో పూర్వ కాలం నుంచి పేటమాలపల్లి, దొంతికుంటకు చెందిన దళితులు అత్యధికంగా సాగులో ఉండగా, సుమారు 350 ఎకరాల్లో ఇప్పటికే పామాయిల్, కొబ్బరితోపాటు ఇతర ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. ఈ భూములను కుడా ధరణిలో ఫారెస్టు భూములుగా చూపించారు. దీంతో ఈ సర్వే నంబరు బాధితులు సైతం గడిచిన ఆరేళ్లుగా సమస్య పరిష్కారం కోసం పడిగాపులు కాస్తున్నారు. భూభారతిలోనైనా సమస్య తీరుతుందా.. లేదా.. అని బాధిత రైతులు ఎదురుచూస్తున్నారు.


ధరణి చట్టంతో అవస్థలు పడుతున్న కన్నాయిగూడెం రెవెన్యూ గ్రామం ఇదే..

**ఆగస్టు 15 వరకు దరఖాస్తులు**



గడిచిన వారం రోజుల నుంచి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ నమోదు చేసే ప్రక్రియను చేపట్టాం. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం దరఖాస్తులు చేసుకున్న రైతులకు నోటీసుల జారీని ప్రారంభించాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం దరఖాస్తులను ఆగస్టు 15 వరకు స్వీకరిస్తాం.

– సీహెచ్‌వీ.రామకృష్ణ, తహసీల్దార్, అశ్వారావుపేట

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


మణుగూరుటౌన్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయం

**మణుగూరుటౌన్:** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రామానుజవరం, సాంబాయిగూడెం గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని తిర్లాపురం, సాంబాయిగూడెం, రామానుజవరం గ్రామాల్లో రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సాంబాయిగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని ఎంఈఓ స్వర్ణజ్యోతి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ, తరుణ్‌రెడ్డి, నాగేశ్వరరావు, సంకపెల్లి రవీందర్‌రెడ్డి, సీతయ్య, కిరణ్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఆయిల్ పామ్ సాగుతో లాభాలు**

**అశ్వాపురం:** ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని, దీనిపై రైతులు దృష్టి సారించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో ఆయన గురువారం ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న 1500 ఎకరాల ఆయిల్‌పామ్ సాగును 20 వేల ఎకరాలలో పెంచాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ మంజూరు కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి కిషోర్, ఏడీఏ తాతారావు, తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, ఉద్యాన అధికారి సాయికృష్ణ, ఆయిల్‌ఫెడ్ డివిజన్ అధికారి రాధాకృష్ణ, ఆయిల్‌పామ్ ఫీల్డ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఎంఈఓ తనిఖీ


పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ లక్ష్మి

**దమ్మపేట:** మండల పరిధిలోని తాటి మల్లప్ప గుంపు ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని హాజరు పట్టికలను, రికార్డులను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలను నాటారు. వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మునగ మొక్కలను పెంచాలని ఆదేశించారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. హెచ్‌ఎం జనార్ధనరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, అచ్చయ్య, రామకృష్ణ, రవి, మల్లేష్, రమేష్, సీఆర్పీ వెంకట్ పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా గొయ్యి..


ములకపాడు సెంటర్‌లో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

**దుమ్ముగూడెం:** మండలంలోని ములకపాడు సెంటర్‌లో భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిపై భారీ గొయ్యి ప్రమాదకరంగా తయారైంది. నిత్యం వేల వాహనాలు ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటాయి. వర్షాకాలం నేపథ్యంలో వర్షపు నీరుతో నిండుతున్న ఈ గొయ్యిలో వాహనాలు స్పీడ్‌గా వచ్చి గుద్దుకుని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గురువారం ఇలాంటి సంఘటనే జరిగింది. అటుగా వెళ్తున్న ఓ లారీ.. హఠాత్తుగా వచ్చిన గుంతను తప్పించుకోబోయి ఓ ద్విచక్రవాహనం వైపు దూసుకుపోయింది. కొద్దిలో ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి ప్రమాదాలు మరిన్ని జరగకముందే ఆర్‌అండ్‌బీ, స్థానిక అధికారులు గొయ్యిని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

# గోదావరి కరకట్ట పరిశీలన


కరకట్టను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

**దుమ్ముగూడెం:** మండలంలో గోదావరి వరదల సమయంలో ఇరిగేషన్ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ ఈఈ సయ్యద్ హమీద్ జానీ అధికారులకు సూచించారు. గురువారం ముంపు ప్రభావిత గ్రామమైన దుమ్ముగూడెంలోని కరకట్ట ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. గోదావరి నది వరద తీవ్రత అంశాలను స్థానిక ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉగ్ర గోదావరి ఏ సంవత్సరాలలో ఏఏ స్థాయిలలో ముంపుకు గురి చేసిందన్న విషయాలపై ఆరా తీశారు. కరకట్ట బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి ముందస్తుగా మరమ్మతుల చర్యలు చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు వరద తీవ్రతను అంచనా వేస్తూ కరకట్ట ముంపు తీవ్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఈ మధుసూదన్ రావు, ఏఈలు రాజ్ సుహాస్, హర్ష నాగ్, పీటీ ఎండి.మస్తాన్ వలి బేగ్, వర్ ఇన్స్‌పెక్టర్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్ ముట్టడి

**పినపాక:** జానంపేట పంచాయతీ పరిధిలోని 511 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిని అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలంగా ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ మేరకు ఆదివాసి గిరిజన సంఘం నాయకులు, సీపీఎం, సీపీఐ నాయకులతో కలిసి తహసీల్దార్కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేసి రియల్ ఎస్టేట్ చేస్తున్నారని, ఆ భూమిని ఇల్లు లేని వారికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు గోవర్ధన్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### మహిళా శక్తి సంబురాలు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం మండలం అశోక్‌నగర్ కాలనీలో ఆశాజ్యోతి వీఓ సమాఖ్య సభ్యుల ఆధ్వర్యంలో మహిళా శక్తి సంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త సంఘాల ఏర్పాటు, వికలాంగుల సంఘం ఏర్పాటు, ఇన్సూరెన్స్, లోన్, ప్రమాద బీమా తదితర అంశాలపై గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు హేమలత, సత్యరమాదేవి, వెంకటలక్ష్మి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

### చర్యలు తీసుకోవాలి

**ములకలపల్లి:** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు సమీపంలోని బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుమల సాయికిరణ్ అన్నారు. ఈ మేరకు గురువారం సంఘం ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలకు అతి సమీపంలో కిరాణా షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని, విద్యార్థులు అసౌకర్యానికి గురౌతున్నారని పేర్కొన్నారు. నాయకులు సమ్మయ్య, రంజిత్ పాల్గొన్నారు.

### 'బంక్‌కు పిండ ప్రదానం'

**దమ్మపేట:** దమ్మపేట బస్టాండ్ ప్రాంగణంలో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని వెంటనే ఆపేయాలని డిమాండ్ చేస్తూ.. గురువారం స్థానికులు బంక్‌కు పిండ ప్రదానం చేశారు. బంక్‌కు వ్యతిరేకంగా స్థానికులు 11వ రోజు రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. కార్యక్రమంలో ఉడతనేని విశ్వేశ్వరరావు, సున్నం శ్రీను, రహీం, సత్యంబాబు, వలీ పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

**దుమ్ముగూడెం:** మండలంలోని పర్ణశాల పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గౌరారం బాలికల ఆశ్రమ పాఠశాలలో డాక్టర్ రేణుక రెడ్డి ఆధ్వర్యంలో గురువారం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. జ్వరంతో ఉన్న నలుగురు బాలికల నుంచి రక్త నమూనాలు సేకరించారు. జలుబు, దగ్గు, దురదలు ఉన్న పిల్లలకు మందులను అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాఠశాల పరిసరాల పరిశుభ్రతను, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం గౌరారం గ్రామంలో టీబీ క్యాంప్ నిర్వహించి దగ్గుతున్న పది మంది నుంచి టీబీ స్పూటం శ్యాంపుల్స్ కలెక్ట్ చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి యాంటీ లార్వాలు ఆపరేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల వార్డెన్ పూనెం లక్ష్మీపతి, వైద్యసిబ్బంది వెంకట నరసమ్మ, నాగేశ్వరరావు, పార్వతి, శిరీష, ఆశాలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమి వేడుకలను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు దర్శించుకుని భజనలు, కీర్తనలతో దైవనామస్మరణ చేశారు. భక్తుల తాకిడితో ఆలయాలు కిటకిటలాడాయి. అన్ని మందిరాల్లో అన్నసమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం పల్లకి సేవ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


చండ్రుగొండ: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


భద్రాచలంటౌన్: జీయర్ మఠంలో పూజలో పాల్గొన్న శ్రీదేవనాథ రామానుజ జీయర్ స్వామి


దుమ్ముగూడెం: దత్తశేష సాయిబాబాకు అభిషేకం చేస్తున్న మహిళలు


బూర్గంపాడు సాయిబాబా మందిరంలో..


మణుగూరురూరల్: బారులుదీరిన భక్తులు

# ఇక తప్పనున్న తిప్పలు..

- మూడు వంతెనల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- ఇప్పటికే రూ.5.3 కోట్లు మంజూరు
- పనులే తరువాయి..


అన్నారం సమీపంలో లోలెవల్ చప్టాలపై పారుతున్న వరద (ఫైల్)

**ములకలపల్లి:** మారుమూల గ్రామాల రహదారి కష్టాలు ఇక తప్పనున్నాయి. మండలపరిధిలోని పాతూరు నుంచి గుర్రాలకుంట గ్రామాల మధ్య వర్షం వస్తే లోలెవల్ చప్టాలపై వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో, జలదిగ్బంధనంలో గడపాల్సి వచ్చేది. ఈ తరుణంలో హైలెవల్ బ్రిడ్జీల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా.. నిర్మాణ పనుల శిలాఫలాకాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గత నెల 20న ఆవిష్కరించారు.

ములకలపల్లి మండలంలోని పాతూరు నుంచి అన్నారం, చింతలపాడు, ధర్మన్ననగర్, గుర్రాలకుంట గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డుపై మూడు చోట్ల వాగు ప్రవాహం రోడ్డు దాటుతూ ఉంది. దీంతో ఆయా ప్రదేశాల్లో ఎన్నోఏళ్ల క్రితం లోలెవల్ చప్టాలు నిర్మించారు. వర్షాకాలంలో ఈచప్టాలపై నీళ్ల ప్రవహిస్తుండంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. అత్యవసర పరిస్థితుల్లో సైతం బైటికి వచ్చే వీలుండేదికాదు. వరద ఉధృతి తగ్గేవరకూ ఆగి అటుపిమ్మట మాత్రమే ముందుకు వెళ్లే పరిస్థితులు ఉన్నాయి. ఇక రోజంతా మురుసువేస్తే. ఆయా గ్రామాల ప్రజలు జలదిగ్బంధనంలో గడపాల్సి వచ్చేంది.

**ఎట్టకేలకు నిధులు మంజూరు**

గిరిజన ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇటీవల ఒకేదఫాలో మూడు వంతెలన నిర్మాణాలకు రూ.5.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పాతూరు శివారులో రూ.1.6 కోట్లు, అన్నారం శివారులో రూ.2.1 కోట్లు చింతలపాడు శివారులో రూ.1.6 కోట్ల వ్యయంతో బ్రిడ్జీలు నిర్మించనున్నారు. ఇటీవలే నిధులు మంజూరుకాగా, టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీఎస్ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలసి లాంఛనంగా ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించారు. పంచాయతీ రాజ్ పర్యవేక్షణలో చేపట్టే ఈపనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో తమ తిప్పలు తప్పినట్లేనని స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నో ఏళ్ల కల సాకారం..**

వానొస్తే పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. వరద తగ్గే వరకూ ప్రయాణం వాయిదా వేయాల్సివచ్చేది. అత్యవసర పరిస్థితుల్లోనూ బయటకి వెళ్లే వీలుండేది కాదు. వంతెనల నిర్మాణంతో రహదారి కష్టాలు తొలగిపోతాయి. వంతెన ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లకల ఎట్టకేలకు సాకారమౌతోంది.

– పర్సిక ప్రసాద్, అన్నారం

**వర్షాలు తగ్గగానే పనులు ప్రారంభిస్తాం..**



మూడు వంతెనల నిర్మాణాలకు టెండర్ ప్రక్రియ పూర్తయింది. వర్షాకాలం నేపద్యంలో వానలు తగ్గగానే పనులు ప్రారంభిస్తాం, త్వరిగతిన పూర్తి చేస్తాం.

– సురేశ్ బాబు, ఏఈ, పీఆర్